క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న దృశ్యం

గుత్తి: గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో గుంతకల్లు రైల్వే ఆస్పత్రి చీఫ్ సూపరిండెంటెంట్ వేణుగోపాల్ రెడ్డి, గుత్తి హెల్త్ యూనిట్ డాక్టర్లు విజయలక్ష్మి, హసీనా ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు, కార్మికులు, సిబ్బందికి బీపీ, షుగర్, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు చేశారు. గుత్తి డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమనే విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు.

సహకార బ్యాంకు చైర్మన్ ప్రమాణస్వీకారం

గుంతకల్లు: పట్టణ ప్రాథమిక పరిమితి వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా తలారి మస్తానప్ప గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగల్‌విండో సొసైటీ చైర్మన్‌గా మస్తానప్ప, డైరెక్టర్లుగా శివశంకర్‌రెడ్డి, సుబ్బయ్యచే గుత్తి సబ్ డివిజన్ కో ఆపరేటివ్ ఆఫీసర్ వీఏ శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా పట్టణ మైనార్టీ అధ్యక్షుడిగా సద్దాం హుస్సేన్‌ను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, కేసీ హరి, రామన్న చౌదరి, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ జన్మాష్టమి ఆహ్వాన పత్రికల విడుదల


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కసాపురం ఎస్‌ఐ వెంకటస్వామి

గుంతకల్లు రూరల్: త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికలను గురువారం కసాపురం ఎస్‌ఐ టీపీ వెంకటస్వామి ఆవిష్కరించారు. మండలంలోని నరసాపురంలో ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

వ్యక్తి అదృశ్యం


దాసరి ప్రభాకర్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలం చిన్నపోలమడ గ్రామానికి చెందిన దాసరి ప్రభాకర్ అనే వ్యక్తి దాదాపు రెండు నెలలుగా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధర్మవరం, మదనపల్లి తదితర ప్రాంతాల్లో చేనేత కూలి పని చేస్తూ జీవించే ప్రభాకర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడేవాడు. రెండు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9010941508, 9182390661 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్‌ఐ గౌస్‌భాషా సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

పామిడి: మండలంలోని తంబళ్లపల్లిలో ఓ ఇంట్లో డంప్ చేసిన వంద ప్యాకెట్ల రేషన్ బియ్యంను గురువారం సాయంత్రం అధికారులు పట్టుకున్నారు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని గుంతకల్లులోని గోడౌన్‌కు తరలించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నులి పురుగులను నివారిద్దాం


పోస్టర్లు విడుదల చేస్తున్న కమీషనర్, పీపీ యూనిట్ వైద్యాధికారి

గుంతకల్లుటౌన్: చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి, ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రను తప్పక వేయించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, ప్రభుత్వాస్పత్రి పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ గంగాధర్ సూచించారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో ఈ నెల 12న నిర్వహించే నులిపురుగుల నిర్మూలన దినోత్సవ పోస్టర్లను వారు విడుదల చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీ విద్యార్థులకు మాత్రలను అందించాలన్నారు. అంతకుముందు తల్లిపాల విశిష్టతను వివరిస్తూ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ, హరిత, హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, సూపర్‌వైజర్ పద్మలత, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

సేవలకు మంగళం!

- తెరుచుకోని ప్రభుత్వ సైట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- విలవిల్లాడుతున్న పేద ప్రజలు



తాడిపత్రి రూరల్: ఏ ముహూర్తాన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందో.. అప్పటి నుంచి పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం ఎక్కడ ఎన్నికల హామీలను అమలు చేయాల్సి వస్తుందోనన్న భయంతో ప్రభుత్వ సైట్‌లను తెరవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తాడిపత్రి నియోజక వర్గంలో ఆరోగ్య శ్రీ కింద 11,200 మందికి ఉచిత వైద్య సేవల కింద రూ.82 కోట్లు ఖర్చు చేశారు. వైఎస్సార్ ఆరోగ్యబీమా కింద 432 మందికి రూ.7.23 కోట్లు వ్యయం చేశారు. ఈ ప్రభుత్వంలో వాటితోపాటు ఇతర పథకాలు, సేవల జోలికి వెళ్లడం లేదు. 2024లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం తాత్కాలికంగా ప్రభుత్వ సైట్‌లను మూసివేసింది. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా ప్రభుత్వ సైట్‌లను తెరవడం లేదు. సైట్‌లు తెరవకపోవడంతో వివిధ పథకాల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రభుత్వ సైట్లు తెరవకపోవడంతో వివిధ రకాల సేవలు, పథకాల కోసం దరఖాస్తులను అప్‌లోడ్ చేయలేకపోతున్నామని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ, వలంటీర్ వ్యవస్థను అమలులోకి తెచ్చి దాదాపు 500 సేవలను సచివాలయాల ద్వారా అమలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను పక్కనపెట్టింది. ఎన్నికల హామీలో భాగంగా రూ.5 వేల నుంచి రూ.10 వేలకు గౌరవవేతనం పెంచుతామంటూ అధికారంలోకి వచ్చిన తరువాత పెంచకపోగా విధుల నుంచి తప్పించారు. వలంటీర్లు లేకపోవడంతో లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు, సేవల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి జనవరి, జులై నెలల్లో కొత్త ఫించన్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేవారు. కొత్త ప్రభుత్వం వల్ల ప్రభుత్వ సైట్లు మూసివేసే సమయానికి దరఖాస్తు చేసుకున్న పింఛన్లకు మోక్షం లభించకపోగా.. కొత్త వాటికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోతోంది. రేషన్‌కార్డుల విషయంలో కూడా ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేస్తోంది. గత ప్రభుత్వంలో సాధారణంగా చనిపోతే రూ.లక్ష, ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5 లక్షలు వైఎస్సార్ బీమా కింద ఆర్థికసాయం అందించేవారు. ఈ ఏడాది జూన్ 30కి గడువు ముగిసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదమైతే రూ.10 లక్షల చొప్పున సాయం అందిస్తామన్న కూటమి ప్రభుత్వం సైట్‌ను ఓపెన్ చేయకపోవడం పట్ల బాధితులు ఆందోళన చెందుతున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డుల పరిస్థితి అలాగే ఉందని, సైట్‌లోని పలు ఆప్షన్లు పని చేయడం లేదని వాపోతున్నారు. పెళ్లికానుక విషయంలోనూ ప్రభుత్వం మీనమేశాలు లెక్కిస్తోంది. గత ప్రభుత్వం పేద కుటుంబాలను ఆదుకోవడానికి వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించింది. బీసీ కులాలకు రూ.50 వేలు, వధువరుల్లో ఎవరైన వికలాంగులు ఉంటే వారికి రూ.75 వేలు, ఎస్సీ సామాజిక వర్గానికి రూ.లక్ష, వారిలో ఒకరు వికలాంగులైతే రూ.1.5లక్షలు, బీసీ,ఎస్సీ సామాజిక వర్గాల్లో కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు చొప్పున ఆర్థికసాయం అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రెండింతలు చేస్తామని ఇచ్చిన హామీ గాలికి వదిలేసింది.

ప్రభుత్వ సైట్లను తెరవాలి



ఎన్నికలకు ముందు మూసివేసిన పలు ప్రభుత్వ సైట్లను తెరవాలి. సైట్లను మూసివేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తులు చేయడానికి సైట్ పనిచేయడం లేదని సచివాలయ ఉద్యోగులు చెపుతున్నారు. – రాజారామిరెడ్డి, రైతుసంఘం నాయకులు

ఉత్తర్వులు రావాలి



వివిధ పథకాలు, సేవలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఉత్తర్వులు వచ్చిన వెంటనే వాటి అమలు వేగవంతం చేస్తాం. దరఖాస్తులు చేసుకునే అర్హులైన వారందరికి లబ్ధి చేకూర్చుతాం.

–శివరామకృష్ణ, మునిసిపల్ కమిషనర్

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలి


సీఎస్‌డీటీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సేవలందించిన ఆర్డీటీకి ఎఫ్ సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలని డీవైఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ వందలాది మంది ర్యాలీ నిర్వహించి, అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటింగ్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ)ను రద్దు చేయడం వల్లనే ఆర్డీటీ క్రమంగా నిర్వీర్యం అవుతూ వచ్చిందన్నారు. ఈ యాక్ట్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి పూర్వ వైభవం ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

హామీలన్నీ నెరవేర్చాలి


గాంధీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

యాడికి: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతలకు 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు మహమ్మద్ రఫీ, బషీర్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడు యాదవ్, వామపక్ష నాయకులు పాల్గొన్నారు. అలాగే జాతీయ చేనేతల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేతన్నలను ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీరాజు, ఈఓపీఆర్‌డీ శశికళ, నేతన్నలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో గురువారం చేనేత కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 246 మంది చేనేత కార్మికులకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. అనంతరం ప్రభుత్వం చేనేత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

చేనేతలకు సన్మానం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం పురష్కరించుకుని బీజేపీ నాయకులు చేనేతలకు ఘన సన్మానం నిర్వహించారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు అంకాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేష్, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరీష్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఆంజనేయులు, నారాయణస్వామి, గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాద్, కృష్ణమోహన్, శేషానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసం చంద్రబాబు నైజం


పిన్నేపల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలా రమేష్‌బాబు

యాడికి: అధికారంలోకి వస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటే రెండింతలు సంక్షేమ పథకాలను అందిస్తామని ప్రకటించిన చంద్రబాబు.. అధికారం చేపట్టాక ప్రజలను నిలువునా దగా చేయటంతో కూటమి ప్రభుత్వంపై పూర్తిగా వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమత్తారు. గురువారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని భోగాలకట్టలో వెంకటరామిరెడ్డి, నగరూరులో భోగాతి బ్రహ్మానంద రెడ్డి, తూట్రాళ్లపల్లిలో సంజీవరాయుడు, పిన్నేపల్లిలో బాలా రమేష్‌బాబు, వేములపాడులో రసూల్, పెద్దపేటలో లక్ష్మిదేవి, యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో బొంబాయి రమేష్‌నాయుడు, రామరాజుపల్లిలో దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రగౌడ్, తలారి నాగేష్ తదితరులు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఇలా హామీలతో ప్రజలను వంచించడం పరిపాటిగా మారిం దన్నారు. చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జగదీశ్వరనాయుడు, రసీదు, సుదర్శన్, దేవేంద్ర, భాస్కర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, జయుడు, రంగస్వామి, ముక్క ఆంజనేయులు, చౌడయ్య, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, చింబిలి జగదీస్, యాతమ్ తిరుమల రెడ్డి, అరవ వెంకటేస్, క్రిష్టారెడ్డి, లక్ష్మిరెడ్డి నారాయణ నెడ్డి, రవి శంకర్ రెడ్డి, కొండారెడ్డి, అగ్గిరాముడు, రోశన్న, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమిది పైశాచిక పాలన


మాట్లాడుతున్న నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి

పామిడి: కూటమి ప్రభుత్వం పైశాచిక పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, గుంతకలు నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మండిపడ్డారు. గురువారం స్థానిక షాదీఖాలో సీపీఐ వందేళ్ల పూర్తి సందర్భంగా నిర్వహించిన 12వ మహాసభలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య పాలన అంతరించి, పారిశ్రామిక వేత్తల చేతుల్లోకి వెళ్లిందన్నారు. టిడ్కో ఇళ్ల పేరుతో సీఎం చంద్రబాబు నిరుపేదలతో డిపాజిట్లు కట్టించుకొని తొమ్మిదేళ్లు గడిచినా గృహాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. పేదలను ఇబ్బందిపెట్టే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సర్దుబాటు చార్జీలను విరమించుకోవాలన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడంలో కూటమి పూర్తిగా విఫలమైందన్నారు. పామిడిలో ఆస్పత్రి, పంచాయతీ, మౌలిక వసతుల కల్పనపరంగా అందాల్సిన సేవలు మృగ్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, జిల్లా సమితి సభ్యులు కే రహీమ్, నాగరాజు, చౌడప్ప, వై సూర్యనారాయణరెడ్డి, ఓంకార్, ఇమామ్, రాముడు, సారంబి, లక్ష్మిదేవి, వలి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగితజ్ఞానం లేకుండా దాడులు చేస్తున్నారు


గడ్డం పరమేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి


షబ్బీర్‌ను పరామర్శిస్తున్న రాష్ట్ర నేత ఫయాజ్‌బాషా


పరమేష్‌ను పరామర్శిస్తున్నవైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిపత్రిటౌన్: ఇళ్లలో మహిళలు, పిల్లలు ఉంటారన్న కనీస ఇంగిజ్ఞానం కూడా లేకుండా రాజకీయ కక్షతో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై దాడుకు దిగుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి మండిపడ్డారు. రాజకీయ కుట్రతో సాగిస్తున్న దాడులను ఆయన ఖండించారు. పట్టణంలో బుధవారం అర్ధరాత్రి టీడీపీ మూకల దాడిలో గాయపడిన బాధితులు గడ్డం పరమేష్, షబ్బీర్‌ను ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నేత ఫయాజ్‌బాషా, ఏపీ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పేరం ప్రతాప్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ గుండాలు సాగించిన దాడులపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని... ఈ పరిస్థితి ఒకేలా ఉండదని భరోసానిచ్చారు. అధికారం అండతో వైస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులకు తెగబడడం సమంజసం కాదన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి నీచ కార్యక్రమాలకు దూరంగా ఉంటే మంచిదని టీడీపీ నాయకులకు హితవు పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.

వర్షం కోసం పూజలు


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

శింగనమల : మండలంలోని గోవిందరాయునిపేట గ్రామంలో వర్షం కోసం గ్రామస్తులు పండితులతో విరాట్ పర్వం చదివించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామంలోని రామాలయంలో పూజలు చేస్తూ, విరాట పర్వం పఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సమాజ అభ్యున్నతికి దోహదపడాలి

గుంతకల్లు: చదువుల్లో మరింతగా రాణిస్తూ..సమాజ అభ్యున్నతికి దోహదపడేలా తయారు కావాలని జిల్లా ఎస్పీ జగదీష్ సూచించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్‌లో పని చేసే పోలీసుల పిల్లలకు ప్రోత్సాహక పురస్కార అవార్డులను అందజేశారు. గుంతకల్లు రైల్వే జీఆర్‌పీలో పని చేసే ఏఆర్ ఎస్‌ఐ బి.వెంకటరమణ కుమారుడు వెంకట్ వరప్రసాద్ రోహిత్ నీట్‌లో మంచి ర్యాంక్ సాధించడంతోపాటు ఇంటర్‌లో 97 శాతంతో పాస్ అయ్యాడు. ఈ నేపథ్యంలో అనంతపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ జగదీష్ చేతులమీదుగా విద్యార్థికి అవార్డు పత్రాన్ని అందజేశారు.

నిమజ్జనం రోజు మద్యం దుకాణాలు బంద్ చేయాలి

తాడిపత్రిటౌన్: వినాయక ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనం రోజు మద్యం దుకాణాలను బంద్ చేయించాలని శ్రీరామ భక్త మండల సభ్యులు గురువారం తహసీల్దార్ సోమశేఖర్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 31 వరకు వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. 31న ఆదివారం జరిగే నిమజ్జనం ఉత్సవాల్లో కొంత మంది ఆకతాయిలు మద్యం మత్తులో అశ్లీల నృత్యాలు చేస్తూ భక్తులపై శుద్ధ పిండిని జల్లుతారన్నారు. ఆరోజు శుద్ధపిండి విక్రయాలను అరికట్టి, మద్యం దుకాణాలను బంద్ చేయించాలని విన్నవించారు. భక్త మండలి సభ్యులు రాధాక్రిష్ణ, లక్ష్మీనారాయణ, వీరప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోను కఠినంగా శిక్షించాలి


ధర్నా చేస్తున్న న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు, సభ్యులు

గుత్తి: గుంతకల్లులోని సోఫియా వీధికి చెందిన షేక్ షమీం భానును మోసం చేసి పెళ్లి చేసుకుని, ఆమె ఆత్మహత్యకు కారణమైన వీఆర్వో మహమ్మద్ వలిని కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. గుత్తిలోని ప్రభుత్వాస్పత్రి వద్ద గురువారం న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏడు నెలల గర్భిణి అని కూడా చూడకుండా వేధింపులకు గురి చేశారన్నారు. మహమ్మద్ వలితో పాటు ఆయన భార్య, బావ మరదులు కూడా షమీం భానును వేధించారన్నారు. ఈ క్రమంలో షమీం భాను గుంతకల్లు వన్ టౌన్ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించగా పోలీసులు న్యాయం చేయలేదన్నారు.

సంక్షిప్తం

జిహేశ్వర మహారాజ్ జయంతి వేడుకలు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని అంబాభవాని దేవాలయంలో జిహేశ్వర మహారాజ్ జయంతి వేడుకలు గురువారం స్వకుల సాలిసమాజ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కోలాటాలు నిర్వహించారు. స్వకులసాలి సమాజ రాష్ట్ర అధ్యక్షులు కాంబ్లె నాగేష్, జాయింట్ సెక్రటరీ శారద, పట్టణ అధ్యక్షుడు కేందోలే చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

పందిని తప్పించబోయి బైక్ బోల్తా

గుత్తి: స్థానిక లచ్చానపల్లి రోడ్డులోని బైబిల్ మిషన్ చర్చి వద్ద ప్రమాదం చోటు చేసుకుని ఇద్దరు యువకులు గాయపడ్డారు. వివరాలు.. గుంతకల్లు మండలం కొంగనపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు నరేష్, వీరాంజనేయులు సరుకుల కొనుగోలుకని గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై గుత్తికి బయలుదేరారు. బైబిల్ మిషన్ చర్చి వద్దకు చేరుకోగానే ఉన్నఫళంగా రోడ్డుకు అడ్డంగా వచ్చిన పందిని తప్పించే క్రమంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో నరేష్ తలకు తీవ్ర గాయమైంది. వీరాంజనేయులు చెయ్యి విరిగింది. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

11న జిల్లా జైలులో వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జిల్లా జైలులో ఈ నెల 11న 25 వేల కిలోల వేరుశనగ చెక్కకు వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ అనిల్‌బాబు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలం ప్రక్రియలో పాల్గొనే వారు రూ. 20వేల ధరావత్తు చెల్లించాలి. ప్రక్రియ ముగిసిన తర్వాత ధరావత్తును వెనక్కు చెల్లిస్తారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని హజరత్ శ్రీమస్తాన్‌వలి దర్గా వద్ద గురువారం అనారోగ్యంతో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి జమాతే ఖుద్దాముల్ ముస్లిమీన్ ట్రస్ట్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. దర్గా సమీపంలోనున్న ముస్లిం శ్మశాన వాటికకు అనాథ మృతదేహాన్ని తరలించి ఖననం చేశారు. కార్యక్రమంలో ఖుద్దాముల్ ట్రస్ట్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, సభ్యులు నౌషద్ వలి, దౌలా, కార్పెంటర్ బాషా, సయ్యద్ అమీర్, బళ్లారిబాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

బుక్కరాయసముద్రం: అమ్మవారిపేట, రేకులకుంటకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్‌కుమార్ గురువారం తెలిపారు. బీకేఎస్‌లో కొత్తగా 33 కేవీ లైను పనులు జరుగుతుండగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు.